సాక్షి
అనంతపురం
మంగళవారం । 11 । జూలై । 2023



తగ్గిన చీనీ ధర

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రిలో మట్కా రాస్తున్న 12 మందిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.6°/22.1°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షాలు పడ్డాయి.

న్యూస్‌రీల్

తుంగభద్రకు పెరుగుతున్న వరద



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఎట్టకేలకు వరద పెరిగింది. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా పరిధిలోని తుంగా (గాజనూరు) జలాశయం నుంచి నదికి నీటిని వదులుతున్నారు. ఈ నీరంతా నది నుంచి తుంగభద్ర జలాశయానికి వస్తోంది. సోమవారం 9,892 క్యూసెక్కులకు పైగా వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. గత శనివారం 274 క్యూసెక్కులు, ఆదివారం 280 క్యూసెక్కులు వస్తూ ఒకే సారి 9,892 క్యూసెక్కులకు నీరు పెరిగింది. ప్రస్తుతం 1578.79 అడుగుల నీటి మట్టంతో 3.911 టీఎంసీల నీరు నిల్వ ఉంది. టీబీ డ్యాంకు వరద రాక మొదలవడంతో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణలోని ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరినార్లు పోసి ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

నర్సాపూర్-యశ్వంతపుర మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సాపూర్-యశ్వంతపుర మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ రైల్వే జంక్షన్ నుంచి ప్రత్యేక రైలు (రైలు నం.07151) ప్రతి మంగళవారం సాయంత్రం 6 గంటలకు బయల్దేరి బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు యశ్వంతపురకు చేరుతుంది. తిరిగి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు యశ్వంతపుర జంక్షన్ నుంచి ప్రత్యేక రైలు (07152) బయల్దేరి గురువారం 8.30 గంటలకు నర్సాపూర్ జంక్షన్‌కు చేరుతుంది. ఈ రైలు పాలుకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక మీదుగా రాకపోకలు సాగిస్తుంది.



అనంతపురం క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పవన్ వ్యాఖ్యలపై
నిరసనాగ్రహం

అనంతపురం సిటీ: అమ్మాయిల అదృశ్యం, మహిళల అక్రమ రవాణాకు వలంటీర్లు కారణమంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై గ్రామ, వార్డు వలంటీర్లు భగ్గుమన్నారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలియజేశారు. ఉరవకొండ, బెళుగుప్ప, కనగానపల్లి, రామగిరి పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పుట్లూరు, గుత్తిలో నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం, రాయదుర్గం, సోమందేపల్లి, ఆత్మకూరు, పరిగి, కళ్యాణదుర్గంలో పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు.



రాయదుర్గంలో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

బీటీపీకి మహర్దశ

మాట ఇస్తే.. మడమ తిప్పరు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. ఈ నెల 8న కళ్యాణదుర్గంలో జరిగిన రైతు దినోత్సవంలో పాల్గొన్న సీఎం భైరవాని తిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మాట ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అక్కడే వివరించారు. ఆయన చెప్పిన మాట ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు తొలి విడత పరిహారం, పనులు మొదలుపెట్టేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తూ జీఓ 2683 విడుదల చేశారు.

- మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- తొలివిడతగా రూ.135 కోట్ల నిధుల విడుదల
- త్వరలోనే రైతుల ఖాతాలకు పరిహారం జమ
- కాలువ తవ్వకం పనులకు మార్గం సుగమం



బీటీపీ ఎత్తిపోతల పథకం కాలువ తవ్వకం పనులు (ఫైల్)

అనంతపురం సెంట్రల్: భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) ఎత్తిపోతల పథకానికి మహర్దశ కలగనుంది. హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) కింద జీడిపల్లి జలాశయం నుంచి బీటీపీ ఎత్తిపోతల పథకానికి కృష్ణాజలాలను తరలించి కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో తాగు-సాగునీటి అవసరాలు తీర్చి సస్య శ్యామలం చేసేందుకు అడుగులు పడుతున్నాయి. 2021 జూలైలో సీఎం రాయదుర్గం పర్యటనకు వచ్చిన సమయంలో బీటీపీ పూర్తి చేస్తామని మాట ఇచ్చారు. ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టు పనులు మొదలుపెట్టారు. గత టీడీపీ పాలకులు ఎన్నికల సమయంలో హడావుడిగా పనులు మొదలుపెట్టి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయే రైతుల గురించి ఆలోచించిన పాపాన పోలేదు. ఈ విషయాన్ని మరుగున పెట్టి ఇటీవల ఓ పచ్చ పత్రిక అవాస్తవాలను ప్రచురించింది. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టులను ఒక పద్ధతి ప్రకారం పూర్తి చేస్తూ వస్తున్నారు. తాజాగా నిధుల విడుదలతో బీటీపీ కాలువ తవ్వకం, లిఫ్టుల నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది.

రూ.135 కోట్ల విడుదల

సీఎం ఆదేశాల మేరకు అధికారులు భూసేకరణ పూర్తి చేశారు. రెండు టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన బీటీపీ ఎత్తిపోతల పథకానికి 1,406 ఎకరాలు అవసరమవుతుందని గుర్తించారు. దాదాపు 600 మంది రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రెండు రోజుల క్రితం కళ్యాణదుర్గం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భూములు కోల్పోయిన రైతులకు రెండు రోజుల్లో పరిహారం విడుదల చేస్తామని, పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని మాట ఇచ్చారు. అన్నట్టుగానే తొలి విడత కింద రూ.135 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భూములు కోల్పోయిన రైతులకు రూ.80 కోట్లు, సివిల్ వర్కులకు రూ.55 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే వెనుకబడిన కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక నెరవేరుతుంది. వర్షాధారం పైనే ఆధారపడిన బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తరలించనున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులను నింపడం ద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. బీటీపీ కింద 12,400 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. ఇందులో ఎడమ కాలువ కింద రాయదుర్గం నియోజకవర్గంలో 8,400, కుడి కాలువ కింద కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 4,000 ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రాజెక్ట్ పేరు	బీటీపీ ఎత్తిపోతల పథకం
ప్రాజెక్టు అంచనా వ్యయం	రూ. 542 కోట్లు
భూసేకరణ కోసం	రూ. 208.85 కోట్లు
కాలువ పొడవు	93 కిలోమీటర్లు
ప్రాజెక్టుకు ప్రధాన నీటి వనరు	హంద్రీనీవా సుజల స్రవంతి పథకం
ఎక్కడి నుంచి ఎలా..?	బెళుగుప్ప మండలం జీడిపల్లి జలాశయం నుంచి ఎత్తిపోతల ద్వారా బీటీపీకి తరలింపు
ప్రాజెక్ట్ సామర్థ్యం	2 టీఎంసీలు
చేపట్టాల్సిన పనులు	93 కిలోమీటర్ల కాలవ నిర్మాణం, 8 లిఫ్టులు, 8 సబ్‌స్టేషన్ల నిర్మాణం

త్వరలో పనులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ప్రజాప్రతినిధుల చొరవతో బీటీపీ ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదలయ్యాయి. మొదటి విడత కింద రూ.135 కోట్లు కేటాయించారు. పరిహారానికి సంబంధించి రైతుల వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. త్వరలోనే వారి ఖాతాల్లో తొలి విడత పరిహారం జమ కానుంది. సివిల్ వర్కులకు నిధులు విడుదలయ్యాయ న్నారు. త్వరలో పనులు మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– దేశేనాయక్, ఎస్‌ఈ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్

మహిళలంటే పవన్‌కు గౌరవం లేదు

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: మహిళలంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు గౌరవం లేదని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. వలంటీర్లను కించపరిచేలా పవన్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. సోమవారం ఆమె 'సాక్షి'తో ఫోన్లో మాట్లాడారు. సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన సచివాలయ -వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇతర దేశాల ప్రతినిధులు మన వలంటీర్ వ్యవస్థ పనితీరును పరిశీలించి వారి దేశంలో అమలు చేసేందుకు కసరత్తు చేసుకుంటున్నారన్నారు. ఇంతటి బాధ్యతాయుతమైన వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. రాజకీయాలకు అతీతంగా కుల, మతాలు తేడా లేకుండా పథకాలను గడప గడపకూ అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై ప్రజల్లో వ్యతిరేకత తీసుకొచ్చేందుకు చంద్రబాబు, పవన్ కుట్ర పన్నారన్నారు. పవన్‌ను చూడగానే ఆడపిల్లలు భయపడే పరిస్థితి ఉందన్నారు. వలంటీర్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నిస్వార్థ సేవకు ప్రతిరూపం వలంటీర్లు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



అనంతపురం క్రైం: నిస్వార్థ సేవకు ప్రతిరూపంగా నిలుస్తున్న వలంటీర్లను తూలనాడితే మట్టి కొట్టుకుపోతారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. వలంటీర్లపై జనసేనాని పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నామమాత్రపు గౌరవ వేతనంతో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు నిస్వార్థంగా సేవలందిస్తున్నారన్నారు. ఎలాంటి లంచం ఆశించకుండా పార్టీలు, కులాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాల లబ్ధిని చేకూరుస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వానికి మంచి పేరు రావడం, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందనే అక్కసుతోనే పవన్ కళ్యాణ్ విజ్ఞత మరచి దిగజారుడు వ్యాఖ్యలు చేశారన్నారు. చంద్రబాబు ఎంగిలి మెతుకులకు అలవాటు పడిన పవన్‌ను మహిళలు చీపుర్లతో తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి సస్పెన్షన్



అనంతపురం టౌన్: అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సత్యనారాయణమూర్తిని సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఐజీ రామకృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల ఆరో తేదీ ఓ స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్ రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు మధ్యవర్తులుగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖర్, ఆయన అసిస్టెంట్ కృష్ణమురళిని అరెస్ట్ చేసి కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. నివేదిక ఆధారంగా సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తిని ఐజీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు డీఐజీ మాధవి తెలిపారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నిర్దేశించిన రుసుము కంటే అదనంగా డబ్బు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని డీఐజీ సూచించారు. అధికారులు, ఉద్యోగులు నిజాయతీగా, నిష్పక్షపాతంగా పని చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధితురాలికి సత్వర సాయం





సీఎం జగన్‌కు సమస్యను తెలియజేస్తున్న నెల్లూరమ్మ, రూ.లక్ష చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన నెల్లూరమ్మ, వీరన్న దంపతుల కుమార్తె బోయ లక్ష్మి రెండేళ్లుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. తమ కుమార్తెకు సాయం చేయాలని నెల్లూరమ్మ ఈ నెల ఎనిమిదో తేదీన కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించింది. సీఎం సానుకూలంగా స్పందించారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ గౌతమి సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్థికసాయం కింద రూ.లక్ష చెక్కును నెల్లూరమ్మకు అందజేశారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలు లక్ష్మికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. పింఛన్ మంజూరు, ఉచితంగా ఇంటి నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు.



కుందుర్పి మండలం మందలపల్లికి చెందిన వెంకటేష్‌కు 200 గొర్రెలు ఉన్నాయి. జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నెల రోజుల వ్యవధిలో జీవాలపై రెండుసార్లు చిరుత దాడి చేసింది. ఒక గొర్రెతో పాటు మరొక విత్తన పొట్టేలును పొట్టన పెట్టుకుంది. రూ.45 వేల దాకా నష్టం వాటిల్లింది. గ్రామ సమీపంలో అటవీ ప్రాంతం అధికంగా ఉంది. చిరుతల దాడితో జీవాల మనుగడ కష్టంగా ఉందని కాపరి వెంకటేష్ తెలిపాడు.



చిరుతల అలజడి

- మేకలు, గొర్రెల మందలే లక్ష్యం
- రెండు మాసాల్లో ఐదారు దఫాలు దాడులు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరిగిన చిరుతల సంఖ్య
- గతేడాది దాడుల్లో చనిపోయిన 35 జీవాలకు పరిహారం

సాక్షి ప్రతినిధి, అనంతపురం

- నెల రోజుల క్రితం రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండల పరిధిలో ఒక చిరుత హల్‌చల్ చేసింది. పగలే ఓ మందపై దాడి చేసి నాలుగైదు మేకలను చంపేసింది. చిరుతను చూసిన కాపరులు పరుగులు తీసి ప్రాణాలు రక్షించుకున్నారు.
- వారం క్రితం రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ఓ గొర్రెల మందలో చిరుత విరుచుకుపడింది. ఎనిమిది గొర్రెపిల్లలను చంపేసి, ఒకదాన్ని ఆరగించింది. ఈ ఘటనతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుతలు అలజడి రేపుతున్నాయి. చిరుత పులుల సంఖ్య పెరుగుతుండటమే దీనికి కారణమని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. రాయలసీమలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుత పులుల సంఖ్య పెరిగిందని, అందుకు ఇక్కడి అడవులు సానుకూలంగా ఉండటమే కారణమని అభిప్రాయపడుతున్నారు. ఓ వైపు జింకల మందలు పెరుగుతున్నా సులభంగా లభించే ఆహారం కాబట్టి చిరుత పులులు ఎక్కువగా గొర్రెలు, మేకలు, ఆవుల మందలనే టార్గెట్ చేస్తున్నాయి. మరోవైపు తాజాగా డి.హీరేహాళ్ మండలంలో ఎలుగుబంటి దాడి నమోదైంది.



చిరుత దాడిలో చనిపోయిన మేక

ఇతర ప్రాంతాల నుంచీ ఇక్కడకు..

కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కానీ డీప్ ఫారెస్టు (చిక్కటి అడవులు)ల్లో చిరుత పులులు ఉండవు. వాటికి చిన్న చిన్న గుట్టలు, చిన్నపాటి చెట్లు ఉండే అడవులు ఇష్టం. ఇలాంటి ప్రాంతాలు వేటకు అనుకూలంగా ఉంటాయి. దీంతో ఆయా జిల్లాల నుంచి చిరుత పులులు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని చిట్టడవులకు చేరుకుంటున్నట్టు ఫారెస్టు అధికారులు గుర్తించారు. వాటి వేలిముద్రల ఆధారాలను బట్టి పరిశీలిస్తే ఇటీవలి కాలంలో ఎక్కువ సంఖ్యలో చిరుతలు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చేరుకున్నట్టు తెలుస్తోంది. గత నాలుగేళ్లుగా తాగునీటికి కూడా ఇబ్బంది లేకుండా గుట్ట ప్రాంతాల్లో నీటిగుంటలు ఉండటంతో చిరుతలు ఇక్కడ స్థిరనివాసం ఏర్పరుచుకున్నట్టు సమాచారం.

బెంబేలెత్తుతున్న కాపరులు

రాయదుర్గం, రాప్తాడు, పెనుకొండ ప్రాంతాల్లో గడిచిన రెండు మాసాల్లోనే నాలుగైదుసార్లు చిరుత పులుల దాడులు నమోదయ్యాయి. దీంతో జీవాల సంఖ్య ఎక్కువగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లా గొర్రెలు, మేకల కాపర్లు బెంబేలెత్తుతున్నారు. గత ఏడాదిలో చిరుతల దాడిలో చనిపోయిన 35 జీవాలకు ఫారెస్టు అధికారులు పరిహారం అందజేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 15 జీవాలను చిరుతలు పొట్టనపెట్టుకున్నట్లు తేలింది. ఈ క్రమంలో జీవాలను మేత కోసం గుట్ట ప్రాంతాల వైపు తీసుకెళ్లాలంటే కాపరులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

చిరుతల సంఖ్య (అంచనా)	35-40
జింకలు	దాదాపు 3,000
ఎలుగుబంట్లు	10-15
అనంతపురం జిల్లాలో గొర్రెలు	24,78,991
అనంతపురం జిల్లాలో మేకలు	5,00,612
శ్రీసత్యసాయి జిల్లాలో గొర్రెలు	27,49,823
శ్రీసత్యసాయి జిల్లాలో మేకలు	5,16,232

రిజర్వు ఫారెస్టులోకి వెళ్లొద్దు



రిజర్వు ఫారెస్టు పరిధిలో మేకలు, గొర్రెలను చిరుతలు చంపేస్తే పరిహారం రాదు. ఇది మూగజీవాల యజమానులు గుర్తుంచుకోవాలి. రిజర్వు ఫారెస్టు కాని ప్రాంతాల్లో దాడులు జరిగితే కచ్చితంగా పరిహారం చెల్లిస్తాం. జనావాసాలు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లోనే పశువులు, గొర్రెలను మేపుకుంటే మంచిది.

– సందీప్ కృపాకర్, జిల్లా అటవీశాఖ అధికారి

'పోలీసు స్పందన'కు 135 వినతులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 135 వినతులు అందాయి. ప్రతి అర్జీని ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వీకరించి, సమస్య తీవ్రతను బాధితులతో అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలి మృతి


వెంకటలక్ష్మి (ఫైల్)

ఉరవకొండ: మండలంలోని వై.రాంపురం నివాసి వెంకటలక్ష్మి (70) పాముకాటుతో మృతి చెందింది. ఈ నెల 8న తన మనవరాలితో కలసి పొలం పనులు చేస్తున్న సమయంలో పాముకాటు వేసింది.విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు లాలెప్ప తక్షణమే ఆమెను ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాకు 2,660 మెట్రిక్ టన్నుల ఎరువులు


పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ ప్రసాద్

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు సోమవారం ఇండియాన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) కంపెనీ నుంచి 2660.80 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. రాప్తాడు ఏఓ వెంకటేశ్వర ప్రసాద్‌తో కలసి ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను పరిశీలించారు. అందులో యూరియా 843 మెట్రిక్ టన్నులు, డీఏపీ 658.5 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 638.5 మెట్రిక్ టన్నులు, 16.16.16 కాంప్లెక్స్ ఎరువులు 520.80 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చాయని పేర్కొన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఏఓ ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సహకార సంఘాలకు సరఫరా చేసి, మిగతావి హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శేఖర్ (ఫైల్)

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం హడగలి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన శేఖర్ (39) రాయదుర్గంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బళ్లారిలో నివాసం ఉంటూ రోజూ రాయదుర్గానికి వచ్చి వెళ్లేవారు. సోమవారం బళ్లారి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన.. మార్గమధ్యంలో హడగలి వద్దకు చేరుకోగానే వేగ నియంత్రణ కోల్పోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు

మార్కెట్ల దూకుడు

- తొలి త్రైమాసికంలో రూ.3.52 కోట్ల వసూళ్లు
- 33 శాతం వృద్ధి సాధించిన మార్కెట్ కమిటీలు
- గతేడాది కన్నా రూ.72 లక్షల అధికంగా ఆదాయం



అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ పయనం ఈసారి ఆశాజనకంగా కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో వసూళ్ల దూకుడు కొనసాగుతోంది. జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది రూ.10.81 కోట్ల వసూళ్ల లక్ష్యం నిర్దేశించారు. తొలి మూడు నెలల కాలానికి గాను రూ.2.86 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా, 33 శాతం లక్ష్య సాధనతో ఇది రూ.66 లక్షలు అధికంగా రూ.3.52 కోట్ల వసూళ్లు జరిగాయి. గత ఏడాది ఇదే సమయానికి రూ.2.80 కోట్లు వసూలైంది. గతేడాదితో పోల్చితే ప్రస్తుతం రూ.72 లక్షలు అధికంగా వసూలు కావడం గమనార్హం. దీంతో ఈ ఏడాది కూడా గడువు లోపు 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేమీకాదని మార్కెట్ కమిటీ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది 2022–23లో రూ.10.43 కోట్లకు గానూ 103 శాతంతో రూ.10.74 కోట్లకు పైగా వసూళ్లు చేయడంతో అనంతపురం జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు ఇచ్చారు.. ఈ ఏడాది కూడా వందశాతానికి మించి వసూళ్లు జరిగేలా విజిలెన్స్ చర్యలు మరింత పటిష్టం చేస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు.

మార్కెట్ కమిటీల్లో తొలి త్రైమాసికం వసూళ్లు ఇలా..

మార్కెట్ కమిటీ	లక్ష్యం	వసూళ్లు
అనంతపురం	రూ.4.10 కోట్లు	రూ.01.66 కోట్లు
తాడిపత్రి	రూ.1.85 కోట్లు	రూ.48.71 లక్షలు
రాయదుర్గం	రూ.1.20 కోట్లు	రూ.31.57 లక్షలు
గుత్తి	రూ.28 లక్షలు	రూ.4.40 లక్షలు
గుంతకల్లు	రూ.85 లక్షలు	రూ.10.27 లక్షలు
కళ్యాణదుర్గం	రూ.52 లక్షలు	రూ.18.99 లక్షలు
రాప్తాడు	రూ.50 లక్షలు	రూ.4.97 లక్షలు
శింగనమల	రూ.75 లక్షలు	రూ.35.55 లక్షలు
ఉరవకొండ	రూ.76 లక్షలు	రూ.31.39 లక్షలు

కారు బోల్తా



గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట శివారులో కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి పట్టణంలోని జంగాల కాలనీలో నివాసముంటున్న ఒకే కుటుంబానికి చెందిన వెంకటేశ్వరమ్మ, రంగారెడ్డి, పద్మావతి, రాజశేఖర్ నంద్యాల జిల్లాలోని యాగంటి క్షేత్రానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం సోమవారం ఉదయం కారులో గుత్తికి బయలుదేరారు. కొత్తపేట శివారులోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపు తప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న గమనించి క్షతగాత్రులను వెలికి తీసి స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వరమ్మ, పద్మావతి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని వైద్యశాలకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం


మహమ్మద్ షఫీ (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలానికి చెందిన మహమ్మద్ షఫీ (20) శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద ఉన్న కియా కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై పెనుకొండకు ప్రయాణమైన షఫీ మార్గమధ్యంలో పామిడి వద్ద లిఫ్ట్ అడిగిన ధనుంజయను ఎక్కించుకుని బయలుదేరాడు. వడియంపేట వద్దకు చేరుకోగానే గ్యాస్ సిలిండర్ల లారీ రోడ్డు క్రాస్ చేస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో మహమ్మద్ షఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ధనుంజయను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ నాగార్జున రెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మట్కా బీటర్ల అరెస్ట్

- రూ.10.21 లక్షలు స్వాధీనం


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో పలువురు మట్కా బీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.10.21లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ గంగయ్య వెల్లడించారు. పెద్ద ఎత్తున మట్కా నిర్వహిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారంతో ఇన్‌చార్జ్ సీఐ శంకరరెడ్డి, ఎస్‌ఐ ధరణీబాబు, ఏఎస్‌ఐలు రాజశేఖర్, నాగన్న, కానిస్టేబుళ్లు చాంద్‌బాషా, భాస్కర్, రమేష్ మూడు బృందాలుగా విడిపోయి తాడిపత్రిలోని పలు ప్రాంతాలను జల్లెడ పట్టారు. విజయనగర్ కాలనీ నివాసి నౌషాద్, శ్రీనివాసపురానికి చెందిన పాల మాబు, టైలర్స్ కాలనీ నివాసి హుసేన్ బాషా, నందలపాడులోని లక్షుమయ్య, నూర్‌మహమ్మద్ వలి, భగత్‌సింగ్ నగర్ నివాసి శరత్‌బాబు, గన్నెవారిపల్లికి చెందిన ఇమాముద్దీన్, ఆస్పత్రి పాలెంలోని హాజీముస్తాఫా, కదిరిసాని ప్రతాప్, హరిజనవాడలో మేకల పుల్లయ్య, పాతకోట నివాసి వెంకటరమణ, రూరల్ పరిధిలోని తలారి చెరువులో నన్నేబచ్చే గారి ఉస్మాన్ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.10,21,355ల నగదుతో పాటు మట్కా పట్టీలు, పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. మట్కా బీటర్ల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు.

అతి పెద్ద క్రిమినల్ పవన్ కళ్యాణ్


యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్

అనంతపురం క్రైం: సంక్షేమ పాలననందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేక జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కడుపు మంటతో వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేయడం సిగ్గు చేటని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్ అన్నారు. వ్యక్తిగత ప్రయోజనం కోసం రాష్ట్రంలో అన్ని విధాలుగా ప్రజలను రెచ్చగొడుతున్న పవన్‌కళ్యాణ్ అతి పెద్ద క్రిమినల్ అని మండిపడ్డారు. వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కోవిడ్ సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా సేవలందించిన వలంటీర్లను బ్రోకర్లు, క్రిమినల్స్ అంటూ మాట్లాడడం పవన్ కళ్యాణ్ అవివేకానికి నిదర్శనమన్నారు. గౌరవవేతనం రూ.5వేలు తీసుకుంటూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలందిస్తున్న వలంటీర్లను విమర్శించడం తగదన్నారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్రంలో మిస్సింగ్ కేసులు గణనీయంగా తగ్గాయని, దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గల రాష్ట్రంగా ఏపీ అవతరించి టాప్ 10లో చేరిందని గుర్తు చేశారు. మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలన్నీ అమలు చేసిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. వంద జన్మలెత్తినా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాయికి చేరలేని పవన్‌కళ్యాణ్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గొర్రెల అపహరణ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని తూర్పు కోడిపల్లి నివాసి క్రిష్టయ్యకు చెందిన గొర్రెలను దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన మేరకు... తనకున్న 100 గొర్రెలను ఆదివారం రాత్రి ఇంటి వెనుక ఉన్న కంచెలో వదిలి నిద్రపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు మందలోకి చొరబడి ఏడు గొర్రెలను ఎత్తుకెళ్లారు. సోమవారం వేకువజామున మంద వద్దకు చేరుకున్న క్రిష్టయ్య గొర్రెలను లెక్కించగా ఏడు తక్కువగా ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ దాదాపు రూ.80 వేలు ఉంటుందని ఈ సందర్భంగా కాపరి క్రిష్ణయ్య తెలిపారు.

అందరికీ కలెక్టర్ ధన్యవాదాలు

అనంతపురం సెంట్రల్: రైతు దినోత్సవం సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన కళ్యాణదుర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ ఎం.గౌతమి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో 'స్పందన' కార్యక్రమం అనంతరం అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద సీఎం చేతుల మీదుగా రైతుల బ్యాంకు ఖాతాలకు పరిహారం జమచేసే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని కళ్యాణదుర్గంలో నిర్వహించినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తమకు అప్పగించిన పనులను సమర్థవంతంగా పని చేసి విజయవంతం చేశారని కొనియాడారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు కూడా పర్యటన విజయవంతానికి దోహదపడ్డాయన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత కల్పించారన్నారు. జిల్లా యంత్రాంగానికి పోలీసు శాఖ పూర్తి సమన్వయాన్ని అందించిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీఓలు, అన్ని శాఖల అధికారులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. సమావేశంలో డీఆర్వో గాయత్రి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన పెరగాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం సెంట్రల్: కుటుంబ సంతోషం, శ్రేయస్సుకు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రెవెన్యూభవన్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. జనాభా నియంత్రణపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్వో గాయత్రీదేవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్, డెమో ఉమాపతి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎంఈజీపీ రుణాల మంజూరు

పీఎంఈజీపీ పథకం కింద మంజూరైన రూ. 49.40 లక్షల రుణ మొత్తాన్ని చెక్కుల రూపంలో లబ్ధిదారులకు కలెక్టర్ గౌతమి అందజేశారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఒక్కొక్క లబ్ధిదారుకు రూ. 1.90 లక్షల చొప్పున పందుల పెంపకానికి విడుదలైన సబ్సిడీ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేసీ కేతన్ గార్గ్, డీఆర్వో గాయత్రీదేవి, పశు సంవర్థకశాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఎల్‌డీఎం సత్యరాజు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు కృషి చేద్దాం : డీఎంహెచ్‌ఓ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: జనాభా పెరుగుదలతో పేదరికం, పర్యావరణ, వనరుల క్షీణత, సామాజిక అసమానతలు తలెత్తుతాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముందు చూపుతో జనాభా నియంత్రణకు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సోమవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ప్రజలను చైతన్య పరిచేందుకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 రోజుల పాటు జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహక రూపంలో నగదు అందజేస్తుందన్నారు.

వృద్ధురాలి కమ్మలు అపహరణ


బాధితురాలు మహబూబ్బీ

ముదిగుబ్బ: మాటలతో మభ్య పెట్టి వృద్ధురాలి చెవిలోని బంగారు కమ్మలను అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. బాధితురాలు తెలిపిన మేరకు... ముదిగుబ్బలో నివాసముంటున్న సత్తార్ సాహెబ్ భార్య మహబూబ్బీకి సాంకేతిక కారణాల రీత్యా రెండేళ్లుగా పింఛన్ అందడం లేదు. ఈ విషయం పసిగట్టిన ఓ యువకుడు సోమవారం వృద్ధురాలి వద్దకు చేరుకుని పింఛన్ మొత్తం రూ.50 వేలు వచ్చిందని, తనకు రూ.10 వేలు చెల్లిస్తే ఈ డబ్బు ఇప్పిస్తానని నమ్మబలికాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని వృద్ధురాలు తెలపడంతో మాటల్లో పెట్టి చెవిలోని మరకమ్మలు చూసిస్తాననడంతో ఆమె తీసిచ్చింది. వాటిని చేజిక్కించుకున్న వెంటనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. ఆ సమయంలో ఆమె కేకలు వేసిన ప్రయోజనం లేకపోయింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపింది.

ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా మహబూబ్

అనంతపురం క్రైం: ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా మహబూబ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులోని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈగా ఉన్న ఆయన డిప్యూటేషన్‌పై అనంతపురానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కింది స్థాయి సిబ్బంది స్వాగతం పలికి, అభినందించారు.

ఆధిక్యంలో కర్నూలు జట్టు


111 పరుగులు సాధించిన సుబ్రహ్మణ్యం


7 వికెట్లు కూలదోసిన హాల్

అనంతపురం: సీనియర్ అంతర జిల్లా క్రికెట్ మల్టీ డే టోర్నీలో భాగంగా మూడో రౌండ్ రెండో రోజు సోమవారం జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు ఆధిక్యత చాటుకుంది. తొలుత జరిగిన మ్యాచ్‌లో అనంతపురం–నెల్లూరు జట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టు 374 చేసింది. పి.సుబ్రహ్మణ్యం 193 బంతుల్లో 17 ఫోర్లతో 111 పరుగులు సాధించాడు. అనంతపురం రెండో రోజు నాలుగు వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. జట్టులో యోగానంద 61 పరుగులు, ఎంకే దత్తారెడ్డి 49 పరుగులతో అజేయంగా నిలిచారు. అలాగే రెండో మ్యాచ్‌లో కర్నూలు, వైఎస్సార్ జిల్లా జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టు 420 పరుగులు చేసింది. వైఎస్సార్ జిల్లా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 10 వికెట్ల నష్టానికి 231 పరుగుల వద్ద చతికిల పడింది. కర్నూలు బౌలర్ హాల్ 7 వికెట్లు కూలదోసి వైఎస్సార్ జిల్లా జట్టును కష్టాల్లోకి నెట్టేశాడు. వైఎస్సార్ జిల్లా బ్యాటర్లు ఎం.మదన్‌కుమార్ 66 పరుగులు, వంశీకృష్ణ 35 పరుగులు, వాసుదేవరాజు 37 పరుగులు చేశారు. కర్నూలు రెండో ఇన్నింగ్స్‌లో 96 పరుగులు చేసింది. గిరినాథ్ 49 పరుగులు, అబ్దుల్ హక్ 37 పరుగులతో అజేయంగా నిలిచారు.

టీడీపీ నేతకు రూ.2.72 లక్షల లబ్ధి

కూడేరు: వైఎస్సార్ పంటల బీమా వర్తింపులో కూడేరు మండలం కడదరకుంటకు చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌చౌదరి కుటుంబానికి రూ.2,72,467ల లబ్ధి చేకూరింది. మండలంలోని ఇప్పేరు రెవెన్యూ పరిధిలో శ్రీధర్ చౌదరికి 9 ఎకరాలు, ఆయన భార్య ఉషారాణి పేరుతో మరో 9 ఎకరాలు, కుమారుడు సాయి జశ్వంత్ పేరుతో ఇంకో 3 ఎకరాల పొలం ఉంది. మొత్తం 21 ఎకరాల్లో చీనీ సాగు చేపట్టారు. ఇందులో శ్రీధర్‌రెడ్డికి రూ.1,17,591, ఉషారాణికి రూ.1,17,466, సాయి జశ్వంత్‌కు రూ.37,410 వైఎస్సార్ పంటల బీమా లబ్ధి చేకూరింది. అలాగే కూడేరు, మరుట్ల, పి.నాగిరెడ్డిపల్లి, ఇప్పేరుతో పాటు మరికొన్ని గ్రామాల్లోని టీడీపీ నేతలకు రూ. వేల నుంచి రూ.లక్షల్లో లబ్ధి చేకూరింది. అయినా ఈ విషయాన్ని కప్పిపుచ్చుతూ పంటల బీమా వర్తింపులో రైతులకు అన్యాయం జరిగిందంటూ సోమవారం కూడేరులోని రైతు భరోసా కేంద్రం వద్ద టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టడాన్ని చూసి ప్రజలు ఏవగించుకున్నారు.

నలుగురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. బసినేపల్లి తండాకు చెందిన కవితాబాయి, తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్‌నాయక్, భానుతో కలసి ఆదివారం రాత్రి బసినేపల్లి తండా బస్టాప్ వద్ద ఆటో కోసం వేచి ఉంది. అదే సమయంలో పత్తికొండ వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన నిల్చొన్న ముగ్గురిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో కవిత, ఆమె ఇద్దరు పిల్లలతో పాటు బెంగళూరుకు చెందిన ద్విచక్ర వాహనదారుడు రోహిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గృహ నిర్మాణ శాఖ ఉద్యోగి మృతి


రత్నం (ఫైల్)

వజ్రకరూరు: వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో గృహ నిర్మాణ శాఖ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని శ్యాంసన్‌పురానికి చెందిన జి.రత్నం (41)కు భార్య సుశీలమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గృహ నిర్మాణ శాఖలో విడనకల్లు మండలవర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు గుంతకల్లు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన.. కొనకొండ్ల శివారులో రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెలను తప్పించబోయి వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


టిల్లు

నర్మెట: ఆడుకుంటూ వెళ్లి ఓ బాలుడు నీటి సంపులో పడి మృతిచెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన సిందే బ్రహ్మయ్య, సంధ్య దంపతులతోపాటు మరో కుటుంబం గ్రామాలలో సర్కస్ చేస్తూ సంచార జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం వెల్దండకు చేరుకున్న వీరు.. రెండు రోజులుగా విన్యాసాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం పెద్దలు గ్రామంలోకి వెళ్లగా పిల్లలతో ఆడుకుంటూ వెళ్లిన టిల్లు (2) నీటి సంపులో పడ్డాడు. ఆలస్యంగా వచ్చిన బ్రహ్మయ్య బాలుడి జాడ కోసం వెతుకుతూ అనుమానంతో సంపులోకి చూడగా అందులో కనిపించాడు. దీంతో వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కాగా, బ్రహ్మయ్య, నందిని దంపతులకు మృతుడు మూడో సంతానం.

జాతీయ పురస్కారం అందుకున్న 'మల్లెల, జాబిలి'


పురస్కారం అందుకుంటున్న కవి మల్లెల నరసింహమూర్తి

అనంతపురం కల్చరల్/పెనుకొండ: ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ కవులు మల్లెల నరసింహమూర్తి , జాబిలి చాంద్‌బాషా (పెనుకొండ) ఆదివారం రాత్రి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. సైమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పేరిట జాతీయ పురస్కారాలను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది పురస్కారాల ప్రదానానికి వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు ఎంపిక కాగా, ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మల్లెల నరసింహమూర్తి, జాబిలి చాంద్‌బాషా ఉండడం గమనార్హం. మల్లెల రచన 'జల స్వప్నం', జాబిలి రచించిన 'మట్టిని ముద్దాడిన మనిషి' కవితా సంపుటిలు పురస్కారానికి ఎంపిక చేశారు. హైదరాబాదులో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆచార్య ఇనాక్ చేతుల మీదుగా వారు పురస్కారాలను అందుకున్నారు. సాహితీవేత్తలు డాక్టర్ నాశేశ్వరం శంకరం, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ఇన్‌కమ్ టాక్స్ విశ్రాంత అధికారి నరసింహప్ప, బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన సంక్షేమ సారథులు

- పవన్ కళ్యాణ్‌ను అరెస్టు చేయాలని నిరసనలు
- జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన


ఆత్మకూరు సర్కిల్‌లో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు


టవర్ క్లాక్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

అనంతపురం క్రైం: ప్రజాహితమే పరమావధిగా సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై అనంతపురం అర్బన్ నియోజకవర్గ వలంటీర్లు కదంతొక్కారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను తప్పుబడుతూ నల్లబ్యాడ్జీలతో క్లాక్‌టవర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి సోమవారం పూలమాల వేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా క్లాక్‌టవర్ వరకు వెళ్లి అక్కడ బైఠాయించారు. పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని, పవన్ కళ్యాణ్‌ను అరెస్టు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. వలంటీర్లు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. అందుకనుగుణంగా వలంటీర్లు నిస్వార్థ సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటోతేదీన ఉదయం 5 గంటలకే ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించడంతోపాటు పథకాలను ఎప్పటికప్పుడు చేరవేస్తున్నట్లు తెలిపారు. అలాంటి తమపై పవన్ కళ్యాణ్ ఆరోపణలు చేయడం తగదన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు పోలీసులు సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు జాకబ్ హరి, శివమ్మ, శివ, మనోజ్, రాజ్యలక్ష్మి, గీత, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ దిష్టి బొమ్మ దగ్ధం

ఆత్మకూరు: వలంటీర్ల సేవలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని గ్రామ వలంటీర్లు కోరారు. సోమవారం ఆత్మకూరు ప్రధాన సర్కిల్‌లో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు దహనం చేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ప్రజలకు మంచి జరగడం ఆయనకు ఇష్టంలేదన్నారు. కరోనాలాంటి విపత్కర సమయంలోనూ వలంటీర్లు చేసిన సేవలు ఆయనకు కళ్లకు కనపడవా? అని ప్రశ్నించారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న గ్రామ వలంటీర్లను తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఓబీ టైలర్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, వార్డు మెంబర్ తైదుల శివారెడ్డి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, భాస్కర్, శ్రీరామ్, వలెంటీర్లు అశోక్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, బాషా, నందిని, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

నోరెలా వస్తుందో?



నా పరిధిలో 50 ఇళ్లున్నాయి. అందులో 40 మంది వివిధ పథకాలతో లబ్ధి పొందుతున్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను కూడా లెక్క చేయలేదు. మా ప్రాంతంలో మందులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశాం. పవన్ కల్యాణ్ ఎక్కడో ఉండి మాట్లాడితే సరిపోదు. వలంటీర్ల సేవలను తెలుసుకోవాలి. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి పవన్‌కళ్యాణ్‌కు నోరెలా వచ్చిందో.. తక్షణం పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి.

– రాణి, వలంటీర్, కోర్టు రోడ్డు 26 సచివాలయం

మహిళా సాధికారతను అడ్డుకుంటున్నారు



నా పరిధిలో ఉన్న 60 కుటుంబాల్లో సగం మందికిపైగా వివిధ పథకాలు పొందుతున్నారు. రోజూ కనీసం 15 నుంచి 20 ఇళ్లను ట్రై సైకిల్‌పై వెళ్లి సందర్శిస్తా. ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరాతీస్తా. ప్రభుత్వం నూతనంగా అందించే ప్రతి విషయాన్ని లబ్ధిదారులకు చేరవేస్తా. ప్రతి నెలా ఉదయం 6 గంటల్లోపే 30 మందికి పింఛన్లు ఇస్తా. పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధించాయి. మహిళా సాధికారతను అడ్డుకునేలా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారు. – నాగరాజు, వలంటీర్,

మూడో రోడ్డు, 68 సచివాలయం

క్లుప్తంగా

పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయండి


ఎంపీపీ హేమలతకు వినతిపత్రం అందిస్తున్న ఆత్మకూరు ప్రజలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఎంపీపీ హేమలతకు ప్రజలు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి రోజూ వందలాది మంది ప్రజలు గ్రామాల నుంచి వస్తుంటారని, బస్టాండ్, బ్యాంకు వద్ద మరుగుదొడ్లు, టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ గూలి కొండారెడ్డి, పెద్ద కొండారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎన్‌సీసీ విద్యార్థులకు విపత్తులు, అగ్నిప్రమాదాలపై అగ్నిమాపకశాఖ అధికారులు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కేపీ లింగమయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు విపత్తుల సమయంలో ప్రజలను రక్షించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి.. విపత్తుల సమయంలో ఎలా సురక్షితంగా బయటపడాలో జాగ్రత్తలు చెప్పారు. ప్రతి విద్యార్థీ ప్రమాదాలపై సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. అనంతరం డెమో ద్వారా ప్రమాదాలపై వివరించారు.

ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్

ఆత్మకూరు: ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు, గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని తోపుదుర్తి గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 11 రకాల ధ్రువీకరణ పత్రాల విషయాన్ని వివరించి, అవసరమైన పత్రాల కోసం వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, సర్పంచ్ ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్‌ఐఓ వాహన డ్రైవర్ మృతి


శ్రీనివాసులు

రాప్తాడురూరల్: ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్‌ఐఓ) వాహన డ్రైవరు జి.శ్రీనివాసులు (58) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న స్పందన కార్యక్రమానికి ఆర్‌ఐఓ సురేష్‌బాబును తన వాహనంలో తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ జరిగే ఎన్‌ఐసీ కార్యాలయం మెట్లు ఎక్కే క్రమంలో శ్రీనివాసులు గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. గుర్తించిన తోటి డ్రైవర్లు, సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆర్‌ఐఓ వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కూతురికి ఆర్నెళ్ల కిందటే వివాహం చేశాడు. ఆర్‌ఐఓ సురేష్‌బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, సిబ్బంది శ్రీనివాసులు నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

రక్తదాతలే ప్రాణదాతలు


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అనంతపురం: రక్తదాతలే ప్రాణదాతలు అని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రణతి, డాక్టర్ రవి అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్‌ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ఎంతో గొప్ప సేవ అన్నారు. కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బీసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు సోమశేఖర్ రెడ్డి, నాగభూషణం, అనంతపురం టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీత జయ మారుతి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్లు ఎన్‌సీడీసీ రుణాలకు కేటాయించండి

అనంతపురం అగ్రికల్చర్: నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) ద్వారా జిల్లాకు రూ.20 కోట్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అధ్యక్షుడు పసుపుల నరసింహగౌడ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కళ్యాణదుర్గం సభలో సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఎన్‌సీడీసీ ద్వారా రాష్ట్రానికి రూ.88.56 కోట్లతో సింహభాగం 'అనంత'కు ఇవ్వాలని కోరామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నందున ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మేలుజాతి విత్తన పొట్టేళ్ల పంపిణీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.90 లక్షలు వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నాలుగేళ్ల కాలంలో మరణించిన జీవాలు, పశువులకు సంబంధించి వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం కింద ఇటీవల రూ.32 కోట్లు మంజూరు చేయడంపై జిల్లా తరఫున సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేశామని తెలిపారు.

పీవీకేకే కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో పీవీకేకే పీజీ కళాశాలలో రక్తనిధి సహాయకుల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బాలాజీ విద్యా సంస్థల అధినేత పల్లె రఘునాథ్‌రెడ్డి రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మునికృష్ణారెడ్డి, రక్తనిధి సిబ్బంది నవీన్‌కుమార్, సంతోష్, శ్రీకాంత్‌చ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

13న ఆత్మకూరు ఉపసర్పంచ్ ఎన్నిక

ఆత్మకూరు: ఈ నెల 13న ఆత్మకూరు పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికకు వార్డు మెంబర్లు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ సహాయ అధికారి దామోదర్‌రెడ్డి

అనంతపురం రూరల్: వార్డెన్లు విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమ సహాయ అధికారి దామోదర్‌రెడ్డి వార్డెన్లను హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులపై చిత్తశుద్ధితో ఉండాలన్నారు. తప్పనిసరిగా హాస్టళ్లలోనే ఉండాలన్నారు. నూతన మెనూను పక్కాగా అమలు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి హాస్టల్‌లోనూ ట్యూటర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు.

35 ప్యాకెట్లు బియ్యం పట్టివేత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, మార్కెట్‌కు తరలిస్తున్న సాకే విజయ్‌కుమార్ అనే వ్యక్తిని విజిలెన్స్ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. అతన్ని అనంతపురం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అతని నుంచి 35 ప్యాకెట్ల బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

నోరుపారేసుకుంటే తరిమికొడతాం


విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం తదితరులు


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం క్రైం: అంకితభావంతో ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై నోరు పారేసుకుంటే రాష్ట్రం నుంచి తరిమికొడతామని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను మేయర్ హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస్థ ఆవరణలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలోని 74 సచివాలయాల పరిధిలో 1,157 మంది వలంటీర్లుంటే అందులో 8,39 మంది మహిళలే వలంటీర్లుగా పని చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వలంటీర్లు ప్రజలకు అన్ని రకాల సేవలందించి ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల దృష్టిలో ఆత్మీయ బంధువులుగా ప్రజల పాలిట నిలిచారన్నారు. రానున్న రోజుల్లో మహిళలు, వలంటీర్లు ఓట్లు వేయరన్న భయంతో పవన్ కళ్యాణ్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్యాకేజీ స్టార్, చోటా స్టార్, 40 ఇయర్స్ ఇండస్ట్రీ స్టార్ ఇలా ఎంత మంది వచ్చినా పొలిటికల్ సూపర్‌స్టార్ మాత్రం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, ఆయన్ను ఏమీ చేయలేరన్నారు.

కాలమే సమాధానం చెప్తుంది..

వలంటీర్లపై నోరుపారేసుకుంటే తరిమికొడతామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి హెచ్చరించారు. అలాంటి వారిని నీవు అమ్మాయిలను ట్రాఫికింగ్ చేస్తున్నారని అనడం సరికాదని, పవన్ కళ్యాణ్‌కు కాలమే సమాధానం చెబుతుందన్నారు. పగలు బీజేపీ, రాత్రి చంద్రబాబు నాయుడుకు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తున్న పవన్ కళ్యాణ్ మహిళలే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహ, లాలు, మునిశేఖర్, లీలావతి, కమల్‌భూషణ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌వి నీచరాజకీయాలు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అధికార దాహంతో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య విమర్శించారు. వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ అర్థరహిత ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికనుగుణంగా ప్రజలకు ఆప్తుల్లా వలంటీర్లు సేవలందిస్తుంటే అలాంటి వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడడం తగదన్నారు. సంఘ విద్రోహశక్తులంటూ నోటికొచ్చినట్లు మాట్లాడడమేంటన్నారు. పవన్ కళ్యాణ్ ఆత్మ విమర్శ చేసుకోవాలని, లేని పక్షంలో ప్రజలు తప్పక బుద్ధి చెబుతారన్నారు.

సీమలో అడుగు పెట్టనివ్వం



మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతపురం క్రైం: దేశానికి ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిరాధారమైన ఆరోపణలు చేశారని, వలంటీర్లకు క్షమాపణ చెప్పకపోతే రాయలసీమలో అడుగు పెట్టబోనివ్వమని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. పవన్ కళ్యాణ్‌కు మహిళలంటే గౌరవం ఉందా? అని ప్రశ్నించారు. వలంటీర్లు కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకోవడం వల్ల హ్యూమన్ ట్రాఫికింగ్ జరిగిదంటూ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వారందించిన సేవలను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. చంద్రబాబు నాయుడుతో కుమ్మక్కై నోరు పారేసుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, వైఎస్సార్ సీపీ నాయకురాలు భారతి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తాం


సంక్షేమ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు, మార్కెట్‌యార్డు చైర్మన్లు

అనంతపురం సిటీ: ముస్లింల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ వసీం, వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్ ఆధ్వర్యంలో నగరంలోని ఖాజానగర్‌లోని మసీద్ ఏ మునావర్ మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముస్లింలతో కలసి నమాజు చేశారు. అనంతరం మత పెద్దలు, ముస్లింలతో సమావేశమయ్యారు. వైఎస్సార్ హయాంలో ముస్లింలకు చేసిన మేలు, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేస్తున్న మేలును వివరించారు. ముస్లింలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు షెక్షావలి, జలాలుద్దీన్, మహమ్మద్ హాసన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి


మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని నగరపాలకసంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పారిశుధ్యం మెరుగుపర్చడంలో భాగంగా చెత్త సేకరణ, క్లాప్ ఆటోల నిర్వహణపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం జీఓ 423 ప్రకారం కార్యదర్శులు నిర్దేశిత విధి విధానాల మేరకు విధులు నిర్వహించాల్సిందేనన్నారు. క్లాప్ ఆటోలు, ఇతర వాహనాల ద్వారా రూట్ మ్యాప్ ప్రకారం చెత్త సేకరణ పక్కాగా చేయాలన్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేయడంతో పాటు రోడ్లు, కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలుకు కృషి చేయాలన్నారు. వీధి వ్యాపారుల నుంచి చెత్త సేకరణకు నిర్దేశిత సమయాన్ని కేటాయించాలన్నారు. ఎక్కడైనా రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుం విధించాలన్నారు. షాపుల నిర్వాహకులు రోడ్డుపై చెత్త పడేస్తే సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ డీఈ రాంప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి

- ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవంలో జేసీ కేతన్‌గార్గ్



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

రాప్తాడురూరల్: విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. సోమవారం నగరంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాలులో ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వై.సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జేసీ కేతన్‌గార్గ్ మాట్లాడారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. నిరంతరం శ్రమించాలన్నారు. రోజూ కొత్తకొత్త అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించి 23 ఏళ్లు పూర్తయిందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన, నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. బాగా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సినిమా పాటలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రీ వాల్యుయేషన్ ఫలితాల విడుదలలో జాప్యమేల?


ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం: రీ వాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేయకుండానే సప్లిమెంటరీ పరీక్షల ఫీజులు వసూలు చేయడం ఏమిటని ఏబీవీపీ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణకు ఏబీవీపీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్కేయూ ఇంజినీరింగ్ విద్యార్థులు మార్చి నెలలో మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఫెయిల్ అయిన సబ్జెక్టులకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేశారన్నారు. కానీ మూడు నెలలు గడుస్తున్నా ఫలితాలు విడుదల చేయలేదు. సప్లిమెంటరీ ఫీజులు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కవిత, దివాకర్, రాకేష్, వికాస్, రిషి, ప్రతాప్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీపీఎస్, శిశు గృహలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ సమితి (ఐసీపీఎస్) సోషల్ వర్కర్ (పురుషులు) ఒక పోస్టు, శిశుగృహలో ఆయా (మహిళ) ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 11 నుంచి 18వ తేదీలోపు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

'అనంత' ప్రజలకు రూ.15 లక్షల పండ్ల మొక్కలు


పండ్ల మొక్కలను ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతుకు అందజేస్తున్న ఏజీఎస్ రెడ్డి ట్రస్టు నిర్వాహకుడు ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి

అనంతపురం క్రైం: అనంత ప్రజలకు ఏజీఎస్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో రూ.15 లక్షల విలువజేసే పండ్లమొక్కల పంపిణీకి శ్రీకారం చుట్టారు. 10వేల జామ, మామిడి, ఉసిరి, బాదాం, జమైకన్ పెప్పర్, నేరేడు, చింత మొక్కలను నగర ప్రజలకు పంపిణీ చేయనున్నారు. అందులో భాగంగా పండ్ల మొక్కలను డీపీఓలోని నర్సరీలో చేర్చేలా చర్యలు తీసుకుంది. మొక్కలను ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతుకు ఏజీఎస్ రెడ్డి ట్రస్టు ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి అందజేశారు.

అక్రమార్కులపై చర్యలు చేపట్టండి

రామగిరి: అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఈప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో అక్రమంగా తరలిస్తున్న మద్యం, ఇసుక వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ప్రాంతంలో పోలీస్ సిబ్బంది గట్టి నిఘా ఉంచాలని, అక్రమంగా ఎవరైనా మద్యం, ఇసుక తరలించినా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్ధన్‌నాయుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.